ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

ఆదివారం 09-08-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక : 52 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

# హైడ్రా దగ్గర హంగామా



**న్యూస్ డెస్క్, 08 ఆగస్టు (ఇది కద నిజం):** హైడ్రా ఉద్యోగాల రిక్రూట్?మెంట్ విషయంలో ఉదయం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన తోపులాట, అభ్యర్థులపై అధికారుల పరుష పదజాలంపై మాజీ మంత్రి హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో ఉద్యోగాలిస్తామని విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకు ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? అని నిలదీశారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలి వస్తే ఇది నిరుద్యోగుల తప్పా? లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా? అని ప్రశ్నించారు. ఈ మేరకు హరీశ్ రావు ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే మీ ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు.

మిగతాది 2 లో..

- హైడ్రా ఉద్యోగాలపై రగడ
- అభ్యర్థులపై అధికారుల దుర్భాషలు
- ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్
- నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలి
- 150 పోస్టులకు వేలాది దరఖాస్తులు
- యువతలో పెరుగుతున్న నిరాశ
- రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏది?
- నిరుద్యోగులను గౌరవించండి
- అధికారులపై చర్యలు తీసుకోండి

# దేశ భవిష్యత్తుపై మోదీ పిలుపు

- వికసిత్ భారత్‌కు యువతే చోదకశక్తి
- టెక్నాలజీతో మారుతున్న ప్రపంచం
- నిరంతర అభ్యాసమే విజయ మంత్రం
- విద్యార్థులకు మోదీ కీలక సూచనలు
- 30 ఏళ్లలో దేశానికి కొత్త దిశ
- ప్రతి నిర్ణయం దేశ ప్రగతికే




2 లో

**న్యూస్ డెస్క్, 08 ఆగస్టు (ఇది కద నిజం):** ఐఐటీ ఢిల్లీ 57వ ఘటికోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సోనెపట్ క్యాంపస్‌లో రూపుదిద్దుకున్న 'పరామ్ ప్రజ్ఞా' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హై-పెర్ఫార్మెన్స్ సూపర్‌కంప్యూటింగ్ సదుపాయాన్ని ప్రధాని మోడీ ప్రారంభించారు.

# ఉపేక్షించం.. చర్యలు తప్పవు

- నిరసనలపై చంద్రబాబు ఫైర్
- రహదారులు బ్లాక్ చేస్తే ఊరుకోం
- చట్టవిరుద్ధ ఆందోళనలు వద్దు
- డీఎస్సీ పేరుతో రాజకీయమా?
- ప్రజలకు ఇబ్బంది పెడితే కఠినమే




**న్యూస్ డెస్క్, 08 ఆగస్టు (ఇది కద నిజం):** వైసీపీ చేపడుతున్న రిలే దీక్షలు, నిరసనలపై సీఎం చంద్రబాబు పరోక్షంగా స్పందించారు. చట్ట వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా నిరసనలు చేపడితే అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. బస్టాండ్లు, రహదారుల వెంట నిరసనలు చేపడితే ప్రభుత్వం ఊరుకోదని హెచ్చరించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు.

నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ.. చట్టానికి వ్యతిరేకంగా, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఆందోళనలు చేయడాన్ని ప్రభుత్వం అనుమతించదని ఆయన అన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షలపై చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ దీక్షల్లో రౌడీలు, గంజాయి బ్యాచ్ తప్ప ఒక్క డీఎస్సీ అభ్యర్థి అయినా ఉన్నారా..? అని ప్రశ్నించారు.

2 లో

# నీట్ కౌన్సెలింగ్‌లో రీసెట్ ఆప్షన్



Office of MCC
Email: adgme@nic.in

GOVERNMENT OF INDIA
DIRECTORATE GENERAL OF HEALTH SERVICES
MEDICAL COUNSELLING COMMITTEE
NEW DELHI-110011

Ref. U-11011/07/2026-MEC — Dated: 07.08.2026

NOTICE

This is for information to all candidates that RESET Registration option has been activated for Round-1 of UG Counselling 2026. Hence, those candidates who have inadvertently entered incorrect information or selected wrong options during registration, may rectify their registration details upto **11:00 AM of 12.08.2026 by using unlock /re-set registration option.**

2 లో

- ఆగస్టు 12 వరకు మాత్రమే అవకాశం
- కేటగిరీ, కోటా వివరాల్లో మార్పులకు అవకాశం
- ఆగస్టు 17న సీట్ల కేటాయింపు ఫలితాలు విడుదల
- ఆగస్టు 18 నుంచి కాలేజీల్లో రిపోర్టింగ్ ప్రారంభం

# పెద్ది కుటుంబానికి కేసీఆర్ అండ



2 లో

- ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయలు
- తల్లి అమృతమ్మకు మరో రూ.25 లక్షలు
- మొత్తంగా రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయం
- పిల్లల భవిష్యత్తుకు పార్టీ అండగా నిలుస్తుంది
- కుటుంబ సంక్షేమాన్ని పర్యవేక్షిస్తామన్న కేసీఆర్
- పెద్ది కుటుంబానికి ఎల్లవేళలా తోడుంటామని హామీ

# ఏఐ మోసాలపై కేంద్రం ఫోకస్



2 లో

- మెటా చర్యలపై పూర్తి నివేదిక కోరిన కేంద్రం
- ఏఐ మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఫోకస్
- డీప్‌ఫేక్‌లపై చట్టపరమైన చర్యలకు కసరత్తు
- మెటాకు సేఫ్ హార్బర్ రక్షణపై సమీక్ష
- ఏఐ కంటెంట్‌కు లేబుల్స్ తప్పనిసరి చేయాలని ఆదేశం

# అమరావతికి రెండు శుభవార్తలు

- ఆగస్టులో రెండు ప్రారంభాలు
- సీడ్ యాక్సెస్ రోడ్డు సిద్ధం
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ రెడీ
- 13న సీడ్ రోడ్డు ప్రారంభం?
- వేగంగా అమరావతి పనులు
- 2028లో తొలి దశ పూర్తి



2 లో

**న్యూస్ డెస్క్, 08 ఆగస్టు (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభవార్తలు వినిపించారు. ఆగస్ట్ నెలలో అమరావతిలో రెండు కీలక ప్రారంభాలు జరుగుతాయని చంద్రబాబు తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతోపాటుగా.. అమరావతి లో నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అమరావతి పనులు వర్షాకాలంలోనూ వేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ పార్టీ ఆఫీసులో చంద్రబాబు విలేకర్లతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు. ఈ క్రమంలోనే అమరావతిలో ఆగస్టు నెలలో రెండు ప్రారంభాలు చేయనున్న విషయాన్ని చంద్రబాబు వెల్లడించారు.


అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు ..మరోవైపు రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో సీడ్ యాకట?్సస్ రోడ్డును ఈ నెల 13న ప్రారంభిస్తారంటూ వార్తలు వస్తున్నాయి. సీడ్ యాక్సెస్ రోడ్డు పూర్తి అయితే ప్రకాశం బ్యారేజీ నుంచి కరకట్ట మీదుగా వేగంగా అమరావతికి చేరుకోవచ్చు. సీడ్ యాక్సెస్ రోడ్డు 21 కిలోమీటర్ల మేరకు నిర్మించారు. ఫేజ్ 1 కింద 14.35 కిలోమీటర్లు, ఫేజ్ 2 కింద 3.92 కిలోమీటర్లు, ఫేజ్ 3 కింద 3.51 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించారు.

# కొత్త పింఛన్లపై కీలక మార్గదర్శకాలు

- ఆదాయం పరిమితి దాటితే పింఛన్‌కు అనర్హులు
- భూమి పరిమితులు దాటినా పింఛన్ రాదు
- ఉద్యోగాలు ఉన్న కుటుంబాలకు కొత్త పింఛన్లు నిలిపివేత
- ఫోర్ వీలర్స్ ఉన్నవారికీ పింఛన్ అనర్హత
- రైస్ మిల్లులు, పెట్రోల్ పంపులున్నా అనర్హులే
- ఇతర పింఛన్లు పొందుతున్నవారికీ కొత్త పింఛన్ లేదు

# సాగర్‌కు భారీ వరద

- 515.30 అడుగులకు నీటిమట్టం
- 49,983 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 140.84 టీఎంసీల నీటి నిల్వ
- సాగర్ గేట్లు మూసివేత
- మరింత పెరిగే అవకాశం



2 లో

**న్యూస్ డెస్క్, 08 ఆగస్టు (ఇది కద నిజం):** ఎగువన ఉన్న శ్రీశైలం జలాశయం నుంచి విద్యుత్ ఉత్పాదన ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం 9 గంటల సమయానికి సాగర్ జలాశయానికి 49,983 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 515.30 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 140.8451 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

పూర్తి స్థాయి సామర్థ్యం 312.0450 టీఎంసీలు. సాగర్ జలాశయం నుంచి ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా నీటి విడుదల ప్రస్తుతం నిలిచిపోయింది.

# తిరువణ్ణామలైలో కలకలం

- మూలవిరాట్ ఫొటోలు తీస్తూ యువకుల పట్టివేత
- కెమెరా గ్లాసెస్‌తో రహస్యంగా చిత్రీకరణకు యత్నం
- ఎల్ఈడీ లైట్‌తో భద్రతా సిబ్బంది అప్రమత్తం
- హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకుల అదుపులోకి
- ఆలయ నిబంధనలు ఉల్లంఘించినట్లు పోలీసుల గుర్తింపు
- స్మార్ట్ గ్లాసెస్‌తో ఫొటోగ్రఫీపై ఆలయంలో నిషేధం

2 లో

# పాక్ ఐఎస్ఐ హనీట్రాప్‌లో వింగ్ కమాండర్

- రక్షణ రహస్యాలు లీక్ చేసిన అధికారిపై అరెస్ట్
- ఆఫిషియల్ సీక్రెట్స్ యాక్ట్ కింద కేసు
- సోషల్ మీడియా ద్వారా ట్రాప్ చేసిన మహిళ
- సైనిక సమాచారాన్ని ఫొటోలు,వీడియోలతో సేకరణ
- స్పైవేర్‌తో మరో అధికారి ఫోన్ టార్గెట్
- వాయుసేన నిఘాతో గూఢచర్యం గుట్టురట్టు

2 లో

# కొత్త పింఛన్లపై కీలక మార్గదర్శకాలు



**న్యూస్ డెస్క్, 08 ఆగష్టు (ఇది కద నిజం):** తెలంగాణ ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు గాను అర్హతలు, అనర్హతలకు సంబంధించిన కీలక మార్గదర్శకాలను ఖరారు చేసింది. అర్హులైన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనర్హుల నిబంధనల జాబితాను విడుదల చేసింది.

అనర్హత వివరాలు ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించి ఉన్నవారు కొత్త పెన్షన్లకు అనర్హులుగా గుర్తించనున్నారు. ఇక కుటుంబానికి 3 ఎకరాలకు మించి సాగు భూమి, 7.5 ఎకరాలకు మించి మెట్ట భూమి ఉన్నట్లయితే వారికి పింఛన్ లభించదు. ఇంట్లో పిల్లలు ప్రభుత్వ, ప్రైవేట్, వృత్తి నిపుణులు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేస్తున్నట్లయితే ఆ కుటుంబాలు అనర్హులుగా పరిగణించబడతాయి. అదేవిధంగా సొంతంగా రైస్ మిల్లులు, పెట్రోల్ పంపులు, ఫోర్ వీలర్స్ ఉన్న కుటుంబాలు దరఖాస్తు చేసుకోవడానికి కొత్త పింఛన్లు దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేదని ప్రటించారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇతర పింఛను పొందుతున్నా వారు నూతన పెన్షన్లకు అనర్హులని అధికారులు స్పష్టం చేశారు.

# పాక్ ఐఎస్ఐ హనీట్రాప్‌లో వింగ్ కమాండర్



**న్యూస్ డెస్క్, 08 ఆగష్టు (ఇది కద నిజం):** భారతీయ వాయుసేన లో ఆందోళనకర పరిణామం చోటుచేసుకుంది. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ వేసిన హనీట్రాప్‌లో చిక్కుకుని దేశ రక్షణ రహస్యాలను శత్రువులకు చేరవేసిన ఓ వింగ్ కమాండర్ హోదా కలిగిన అధికారిని ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు అతడిపై ఆఫిషియల్ సీక్రెట్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి తీహార్ జైలులో జ్యూడీషియల్ కస్టడీకి తరలించారు.

హనీట్రాప్‌తో పక్కా ఇన్‌ఫర్మేషన్ సేకరణ..

సోషల్ మీడియా ద్వారా సదరు వింగ్ కమాండర్‌తో పరిచయం పెంచుకున్న ఓ అజ్ఞాత మహిళ, వీడియో కాల్స్, చాటింగ్ ద్వారా ఆయనను లోబరుచుకుంది. అనంతరం భారత సైనిక దళాల కదలికలు, కీలక వ్యూహాత్మక ప్రాంతాలు, మిలిటరీ యూనిట్ల వివరాలను ఫోటోలు, వీడియోల రూపంలో సేకరించినట్లుగా ప్రాథమిక విచారణలో తేలింది. కేవలం దశ రహస్యాలు చేరవేయడమే కాకుండా, తనతో పనిచేసే మరో ఎయిర్‌ఫోర్స్ అధికారి మొబైల్ ఫోన్‌లో సమాచారాన్ని దొంగిలించేలా ఓ ప్రమాదకరమైన స్పైవేర్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి కూడా ఆ వింగ్ కమాండర్ ప్రయత్నించినట్లుగా అధికారులు గుర్తించారు. ఈ మొత్తం తతంగా వెనుక పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఐఎస్ఐ హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

అయితే, ఈ వ్యవహారాన్ని ముందుగానే గుర్తించిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం, ఆ అధికారిని కొంతకాలంగా తమ నిఘా పరిధిలో ఉంచింది. ఆయన అనుమానాస్పద కార్యకలాపాలను నిర్ధారించుకున్న అనంతరం, ఆధారాలతో సహా ఢిల్లీ పోలీసులకు సమాచారం అందించి కస్టడీకి అప్పగించింది.

# నీట్ కౌన్సెలింగ్‌లో రీసెట్ ఆప్షన్

**న్యూస్ డెస్క్, 08 ఆగష్టు (ఇది కద నిజం):** నీట్ యూజీ 2026 ఫస్ట్ ఫేజ్ విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో ఉన్న వైద్య విద్యార్థులకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ భారీ ఊరటనిచ్చింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏవైనా పొరపాట్లు చేసినా, తప్పుడు కోటా వివరాలను నమోదు చేసిన అభ్యర్థుల కోసం రీసెట్ రిజిస్ట్రేషన్ ఆప్షన్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే, ఈ ఆప్షన్ ఆగస్టు 12 ఉదయం 11 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉండనుంది. కేటగిరీ, కోటా, వ్యక్తిగత వివరాల్లో తప్పులు సరిదిద్దుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. గడువు ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తులను దిద్దడానికి అనుమతించబోమని ఎంసీసీ ఇప్పటికే స్పష్టం చేసింది.

సీట్ల కేటాయింపు షెడ్యూల్ ఇలా..

కౌన్సెలింగ్ షెడ్యూల్, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపుల ప్రక్రియ ఆగస్టు 12 మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుంది. అదేవిధంగా చాయిస్ ఫిల్లింగ్ ప్రాసెస్ ఆగస్టు 13 ఉదయం 11 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. చాయిస్ లాకింగ్ ఆప్షన్ ఆగస్టు 12 సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమవుతుంది. ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు ఫలితాలను ఆగస్టు 17న విడుదల చేయనున్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 18 నుంచి 22వ తేదీల మధ్య సంబంధిత మెడికల్ కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు అభ్యర్థులు ఎంసీసీ అధికారిక వెబ్‌సైట్ mcc.nic.inను సంప్రదించవచ్చని అధికారులు వెల్లడించారు.

# హైడ్రా దగ్గర హంగామా

సీఎం బాటలోనే అధికారులు:

మొదటి పేజీ తరువాయి




ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో "క్రిమినల్ వేస్ట్" అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే "యథా రాజా.. తథా అధికారులు" అన్న సామెత గుర్తుకొస్తోందని హరీశ్ రావు అన్నారు. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం అని, ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు? అని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. 32 నెలలు దాటింది, ఆ హామీ ఏమైందన్నారు.

యువతలో నిరాశ పెరుగుతోంది: రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్, మీ జాబ్ క్యాలెండర్ బోగస్, నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్ అని దుయ్యబట్టారు. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోందని నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పీజీ, పీ?హెచ్?డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోండి: సరూర్ నగర్ లో జరిగిన ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి ఏకంగా విద్యార్థులపైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి గారూ.. నిరుద్యోగులు మీపై జాలి అడగడం లేదు. మీరు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్నారని ఉద్యోగం అడగడం నేరం కాదు. ప్రశ్నించడం నేరం కాదు. ప్రభుత్వాన్ని నిలదీయడం నేరం కాదన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం కనీసం ఉద్యోగం కోసం వచ్చిన నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగ లోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# దేశ భవిష్యత్తుపై మోదీ పిలుపు

మొదటి పేజీ తరువాయి

అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అయితే, విజేతల్లో అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉండటంపై స్పందిస్తూ.. "ఒకటి, రెండు పతకాలే ఎందుకుండాలి? మెడల్స్ సాధించిన వారిలో బాలికల భాగస్వామ్యం మరింత ఎక్కువగా ఉంటే ఎంతో బాగుండేది" అని సరదాగా వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా ప్రధాని మోడీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సాంకేతిక, వ్యూహాత్మక సమీకరణాలపై ప్రధాని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ శక్తి సమతుల్యత క్షణక్షణానికీ రూపాంతరం చెందుతోందని, రాబోయే 20-30 ఏళ్లలో ప్రపంచం ఏ దిశగా వెళ్తుందో ఎవరూ ఖచ్చితంగా ఊహించలేరని పేర్కొన్నారు. పరిశ్రమలు, సాంకేతికత ఎంత మారినా, నిరంతరం నేర్చుకునే తత్వమున్న వారే విజయాలు సాధిస్తారని ప్రధాని ఉద్ఘాటించారు. విద్యార్థుల మనసులో రేపటి భవిష్యత్తు గురించి ఎన్నో ఆలోచనలు ఉంటాయని, ప్రతీ ఒక్కరూ ఒక నిర్దిష్టమైన విజన్‌తో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ప్రతి తరం కూడా ఆనాటి సవాళ్లను ఎదుర్కొంటూ జాతీయ బాధ్యతను మోయాల్సి ఉంటుందని ప్రధాని పిలుపునిచ్చారు. వచ్చే 30 నుంచి 35 సంవత్సరాల కాలం దేశాన్ని 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్)గా మార్చడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యార్థులు తమ జీవితంలో తీసుకునే ప్రతి నిర్ణయం దేశ పురోగతికి, దేశ అవసరాలను తీర్చడానికి ఏ విధంగా ఉపయోగపడుతుందనే అంశాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రధాని మోడీ విద్యార్థులకు నిర్దేశం చేశారు.

# ఏఐ మోసాలపై కేంద్రం ఫోకస్




**న్యూస్ డెస్క్, 08 ఆగష్టు (ఇది కద నిజం):** సోషల్ మీడియా వేదికగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో చేస్తున్న డీప్‌ఫేక్ వీడియోలు, ఫోటోల వ్యాప్తిపై కేంద్ర ప్రభుత్వం సీరియస్ అయింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌ల మాతృ సంస్థ అయిన మెటా నుంచి ఇదే అంశంపై తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన కంప్లీట్ రిపోర్టు ఇవ్వాలని కోరింది. అయితే, ఈ మధ్య కాలంలో సెలబ్రిటీలు, పొలిటికల్ లీడర్లు, సామాన్యుల డీప్‌ఫేక్ వీడియోలు సృష్టిస్తూ సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న ఘటనలు రోజురోజుకు ఎక్కవ అవుతున్నాయి. వాటిని అరికట్టడంలో సోషల్ మీడియా దిగ్గజాలు విఫలమవుతున్నాయనే విమర్శల నేపథ్యంలో కేంద్ర సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఈ మొత్తం వ్యవహారంపై ఫోకస్ పెట్టింది.

లీగల్ ఒపీనియన్ కోసం కేంద్ర వెయిటింగ్..

డీప్‌ఫేక్స్‌ను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవాలో టెక్ నిపుణుల నుంచి కేంద్ర ప్రభుత్వం లీగల్ ఒపీనియన్ తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఐటీ చట్టం, నిబంధనలు 2021 ప్రకారం సదరు ప్లాట్‌ఫారమ్‌లకు ఇచ్చిన సేఫ్ హార్బర్ రక్షణను తొలగించే అవకాశాలను కూడా కేంద్రం చాలా సీరియస్‌గా పరిశీలిస్తున్నది. కాగా, ఇప్పటికే సోషల్ మీడియా వేదికల్లో తమ ప్లాట్‌ఫారమ్‌లలో వచ్చే ఏఐ కంటెంట్‌ను గుర్తించే విధంగా లేబుల్స్ వేయాలని, ఫిర్యాదు వచ్చిన అతి తక్కువ సమయంలోనే వాటిని తొలగించాలని ఆదేశాలు కూడా జారీ అయిన విషయం తెలిసిందే.

# పెద్ది కుటుంబానికి కేసీఆర్ అండ



**న్యూస్ డెస్క్, 08 ఆగష్టు (ఇది కద నిజం):** ఇటీవల అనారోగ్యంతో మరణించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలవాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా, సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థికసాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో, పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో రూ.25 లక్షలు తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని నిర్ణయించారు. తద్వారా మొత్తంగా, 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి భారత రాష్ట్ర సమితి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నది. ఇంతటితోనే కాకుండా పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని అధినేత తెలిపారు. ఈ మేరకు పార్టీ సీనియర్లతో పాటు వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. కాగా, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్యులు కూర్చొని వారి కుటుంబానికి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

# అమరావతికి రెండు శుభవార్తలు



**న్యూస్ డెస్క్, 08 ఆగష్టు (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభవార్తలు వినిపించారు. ఆగస్ట్ నెలలో అమరావతిలో రెండు కీలక ప్రారంభాలు జరుగుతాయని చంద్రబాబు తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతోపాటుగా.. అమరావతి లో నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అమరావతి పనులు వర్షాకాలంలోనూ వేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ పార్టీ ఆఫీసులో చంద్రబాబు విలేకర్లతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు. ఈ క్రమంలోనే అమరావతిలో ఆగస్టు నెలలో రెండు ప్రారంభాలు చేయనున్న విషయాన్ని చంద్రబాబు వెల్లడించారు.

అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు ..మరోవైపు రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో సీడ్ యాకట?స్ రోడ్డును ఈ నెల 13న ప్రారంభిస్తారంటూ వార్తలు వస్తున్నాయి. సీడ్ యాక్సెస్ రోడ్డు పూర్తి అయితే ప్రకాశం బ్యారేజీ నుంచి కరకట్ట మీదుగా వేగంగా అమరావతికి చేరుకోవచ్చు. సీడ్ యాక్సెస్ రోడ్డు 21 కిలోమీటర్ల మేరకు నిర్మించారు. ఫేజ్ 1 కింద 14.35 కిలోమీటర్లు, ఫేజ్ 2 కింద 3.92 కిలోమీటర్లు, ఫేజ్ 3 కింద 3.51 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్

మరోవైపు అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం క్వార్టర్స్ నిర్మించారు. 12 అపార్టుమెంట్ టవర్ల నిర్మాణం పూర్తి అయ్యింది. వీటిని త్వరలోనే సాధారణ పరిపాలన శాఖకు అప్పగించనున్నారు. ఈ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్‌లను కూడా ఆగస్టు నెలలోనే ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. మొత్తంగా అమరావతిలో ఇప్పటికే సీఆర్డీఏ భవనం అందుబాటులోకి రాగా.. ఇప్పుడు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్, సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి రానుంది. దీంతో అమరావతి నిర్మాణ పనులలో కీలక ప్రారంభోత్సవాలకు ఆగస్ట్ నెల వేదిక కానుంది. మరోవైపు 2028 నాటికి అమరావతి తొలిదశ నిర్మాణం పూర్తి చేస్తామని ప్రభుత్వం చెప్తున్న సంగతి తెలిసిందే. ఆ దిశగా నిర్మాణ పనులలో వేగం పెంచారు.

# తిరువణ్ణామలైలో కలకలం




**న్యూస్ డెస్క్, 08 ఆగష్టు (ఇది కద నిజం):** సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో కెమెరా అమర్చిన స్మార్ట్ గాగుల్స్‌ను ఉపయోగించి రహస్యంగా ఫోటోలు, వీడియోలు తీసేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అడ్డంగా దొరికిపోయిన యువకులు

హైదరాబాద్‌కు చెందిన భవనీష్, మహేష్ అనే ఇద్దరు యువకులు తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి, ఉణ్ణాములై అమ్మవారిని దర్శించుకోవడానికి ఆలయానికి వచ్చారు. ఈ క్రమంలో వారు మెట్టా రే-బాన్ కంపెనీకి చెందిన కెమెరా అమర్చిన స్మార్ట్ గ్లాసెస్ ధరించి, ఆలయంలోని మూలవిరాట్, అమ్మవారిని సీక్రెట్‌గా ఫోటోలు తీయడానికి ప్రయత్నించారు. అయితే, స్మార్ట్ గ్లాసెస్ ద్వారా ఫోటోలు, వీడియోలు రికార్డ్ చేస్తున్న సమయంలో కళ్లజోడుపై ఉన్న చిన్న ఎల్ఈడీ లైట్ నుంచి ఉన్నట్లుండి లైట్ బ్లింక్ అవ్వడంతో భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. అనంతరం యువకులను ఇద్దరిని ఆపి విచారించగా, వారు స్మార్ట్ గ్లాసెస్‌తో నిబంధనలకు విరుద్ధంగా ఫోటోలు తీస్తున్నట్లుగా గుర్తించి పోలీసులకు అప్పగించారు.

# సాగర్‌కు భారీ వరద



**న్యూస్ డెస్క్, 08 ఆగష్టు (ఇది కద నిజం):** ఎగువన ఉన్న శ్రీశైలం జలాశయం నుంచి విద్యుత్ ఉత్పాదన ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం 9 గంటల సమయానికి సాగర్ జలాశయానికి 49,983 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 515.30 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 140.8451 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

పూర్తి స్థాయి సామర్థ్యం 312.0450 టీఎంసీలు. సాగర్ జలాశయం నుంచి ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా నీటి విడుదల ప్రస్తుతం నిలిచిపోయింది. కుడి, ఎడమ కాలువలకు కూడా నీటి విడుదల లేదు. క్రస్ట్ గేట్లు మూసి ఉండగా, ఎస్ఎల్‌బీసీ(ఏఎంఆర్‌పీ) ద్వారా 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయం నుంచి నదిలోకి నీటి విడుదల లేకపోగా, మొత్తం ఔట్‌ఫ్లో 900 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం ఇదే విధంగా కొనసాగితే సాగర్ జలాశయంలో నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉంది. అధికారులు జలాశయానికి వస్తున్న ఇన్‌ఫ్లో, నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# ఉపేక్షించం.. చర్యలు తప్పవు

మొదటి పేజీ తరువాయి

కర్నూలులో తాజాగా నిరసన చేపట్టిన వారంతా డీఎస్సీ ఉద్యోగాలకు ఎంపికైన టీచర్లేనని చంద్రబాబు పేర్కొన్నారు. టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన వారు నిరసనల్లో పాల్గొన్నారని చెప్పారు.

గత పాలక పార్టీ చేసిన నష్టం కారణంగానే టీచర్లు ఐక్యంగా తమ ఆత్మగౌరవాన్ని చాటుకున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన పరిణామాల వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు వారు ఐక్యంగా స్పందిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే నిరసనలు, రహదారులు, బస్టాండ్లను అడ్డుకునే ఆందోళనలను ప్రభుత్వం అంగీకరించబోదని సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# తెలంగాణలో జల ఉద్యమం



**న్యూస్ డెస్క్, 08 ఆగష్టు (ఇది కద నిజం):** సీఎం రేవంత్ రెడ్డి దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ మాత్రమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చిట్ చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ... జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాను ఒప్పుకున్నారా? ఈ సమావేశానికి హాజరవుతారా? హాజరైతే తెలంగాణ ప్రజల తరపున ఏం చెప్తారు? అనేదానిపై ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్థాయిలో ఈ జల ఉద్యమం వస్తుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ నీటి హక్కులకు మించిన మరో ప్రాధాన్యత తమ పార్టీకి లేదని, నదీ జలాల్లో కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే ఎజెండాను ఒప్పుకొని ఎలా మీటింగ్‌కి హాజరవుతారని ప్రశ్నించారు.

తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అంటూ మండిపడ్డారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? అంటూ ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని వ్యాఖ్యానించారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతోందని చెప్పారు. ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. నదుల నుండి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తిపోసుకుంటే... ముఖ్యమంత్రికి కనీసం సోయి లేదని విమర్శించారు. యాగాలు చేస్తే తప్పు లేదు కానీ... యాగాలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రికి తన బాధ్యతలు నిర్వహించాలని అన్నారు. రేవంత్ రెడ్డికి పంపులు ఎప్పుడు ఆన్ చేయాలి, నీళ్లు ఎప్పుడు ఎత్తిపోయాలో కనీస అవగాహన లేదని విమర్శించారు. పాలమూరు జిల్లా బిడ్డ అని చెప్పుకునే రేవంత్ కనీసం అక్కడికి చెరువులలో నీళ్లు నింపడానికి కూడా సోయి లేదన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పైన తెలంగాణకు నష్టం జరిగేలా ఆంధ్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను అంగీకరిస్తున్నారా లేదా అన్నది కాంగ్రెస్ ఇప్పటిదాకా స్పష్టం చేయలేదన్నారు. క్షుద్రపూజలు అని చెప్పి కాంగ్రెస్ క్షుద్ర రాజకీయాలు చేస్తోందన్నారు. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటామని చెప్పారు.హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్ లను ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని విమర్శించారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ఒక హైకోర్టు ప్రభుత్వాన్ని హైడ్రా విషయంలో అభిశంసన ఇచ్చిన తీరుగా ఎప్పుడూ చేయలేదన్నారు. ప్రభుత్వ అధికారులపైన నమ్మకం లేదు, ఆర్మీని రంగంలోకి దించుతామని అంత ఘాటుగా ఎప్పుడూ చెప్పలేదని వ్యాఖ్యానించారు. పేదలను కొట్టి పెద్దవాళ్లకు దోచిపెట్టడమే హైడ్రా ద్వారా రేవంత్ రెడ్డి చేస్తున్న పని అంటూ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇచ్చిందా? అని ప్రశ్నించారు.

# సామాజిక న్యాయ తెలంగాణ రథసారధిగా కవిత గారికే ప్రజల ఆమోదం

**సామాజిక సంకల్ప సభ ద్వారా తన సంకల్పం చాటిన టీఆర్ఎస్ చీఫ్**

**ప్రతి ఒక్క వర్గాన్ని ఆలోచింపజేసిన కవిత సందేశం**

**సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ గ్రాండ్ సక్సెస్**

**టీఆర్ఎస్ నేతలు రూప్ సింగ్, ఇస్మాయిల్**




ఇది కద నిజం,హైదరాబాద్ :

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ద్వారానే తెలంగాణలో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారని తెలంగాణ రక్షణ సేన నాయకులు రూప్ సింగ్, ఇస్మాయిల్ అన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. గురువారం సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ ద్వారా కవిత మాట్లాడిన అంశాలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశాయని వారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీసీలను కేవలం ఓటు బ్యాంక్ గా మాత్రమే చూస్తున్నాయని వారు మండిపడ్డారు. కేవలం కవిత ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్న నమ్మకాన్ని నిన్నటి సభ ద్వారా ప్రజలకు కల్పించారని చెప్పారు. సభను పెద్ద ఎత్తున సక్సెస్ చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**కవిత గారి నాయకత్వంలోనే సామాజిక న్యాయం – రూప్ సింగ్**

ఈ రాష్ట్రంలో సామాజిక న్యాయం కవిత గారి ద్వారానే సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ విశ్వసిస్తున్నారని రూప్ సింగ్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం అన్న సోయినే మరిచిపోయాయని ఆయన విమర్శించారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా నిర్వహించలేనంత గొప్పగా సామాజిక న్యాయ తెలంగాణ సభను నిర్వహించటమే కాకుండా...వారికి తన ద్వారానే న్యాయం జరుగుతుందన్న భరోసాను కల్పించారని చెప్పారు. అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్న తన సంకల్పం ఎంత గట్టిదో నిన్నటి సభ ద్వారా కవిత ప్రజలకు చాటి చెప్పారన్నారు. ఈ సభ తర్వాత సామాజిక న్యాయ తెలంగాణ కు రథసారధిగా కవిత గారే ఉండాలని ప్రజలంతా భావిస్తున్నారని రూప్ సింగ్ చెప్పారు. పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

**ఇది ఆరంభం మాత్రమే– ఇస్మాయిల్**

సామాజిక న్యాయ తెలంగాణ సాధనలో కవిత గారు నిన్నటి సభ ద్వారా తొలి అడుగు వేశారని ఇస్మాయిల్ అన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని...భవిష్యత్ లో మరిన్ని కార్యక్రమాలు చేపడతారన్నారు. కవిత గారి ఏర్పాటు చేసిన సభను అడ్డుకోవాలని, ఆమె అగ్రకులం అని మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఫెయిల్ చేయాలని భావించిన వారికి కవిత గారు తన ప్రసంగం తో చెంపపెట్టులాంటి సమాధానం ఇచ్చారన్నారు. సామాజిక న్యాయం కోసం చేసిన తీర్మానాల పై ప్రజల నుంచి పెద్ద ఎత్తున హర్షధ్వనాలు వ్యక్తమవుతున్నాయన్నారు. గత బీఆర్ఎస్, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉద్యమకారులు, అమరులను ఆకాంక్షలను విస్మరించాయని ఇస్మాయిల్ మండిపడ్డారు. మారోజు వీరన్న, ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాలను కవిత ముందుకు తీసుకెళ్తుందన్న నమ్మకంలో ప్రజల్లో ఏర్పడిందని చెప్పారు. సామాజిక న్యాయం కోసం గతంలో ఏ పార్టీ కూడా ఆలోచన చేయలేదని ఇస్మాయిల్ గుర్తు చేశారు. సామాజిక తెలంగాణ పట్ల తనకు ఎంతో చిత్తశుద్ధి ఉందో ఈ సభ ద్వారా కవిత చాటి చెప్పారన్నారు. పెద్ద ఎత్తున సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మీడియా సమావేశంలో టీఆర్ఎస్ సీనియర్ నేత రవిచంద్ర పాల్గొన్నారు.

# ప్రజల భవిష్యత్తుకు గ్రామ స్వరాజ్యమే ప్రత్యామ్నాయం

**విద్యావేత్త, రచయిత, సామాజిక ఉద్యమకారుడు పొగాకుల విష్ణు వర్ధన్ గౌడ్‌తో కాసాని శ్రీనివాసరావు గౌడ్ భేటీ**

**గ్రామ స్వరాజ్య ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆహ్వానం**

**ప్రజలకు ఇప్పుడు కావాల్సింది గ్రామ స్వరాజ్యమే: విష్ణు వర్ధన్ గౌడ్**



ఇది కద నిజం,హైదరాబాద్:దేశ రాజకీయాలు, పరిపాలనా వ్యవస్థలు ప్రజల జీవన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామ స్వరాజ్యమే ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం అని జై స్వరాజ్ పార్టీ అధినేత శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ్ పేర్కొన్నారు. విద్యావేత్త, రచయిత, సామాజిక ఉద్యమకారుడు, విష్ణు ఐఏఎస్ అకాడమీ చైర్మన్, రాజకీయ నాయకుడు పొగాకుల విష్ణు వర్ధన్ గౌడ్ను కాసాని శ్రీనివాసరావు గౌడ్ కలిసి గ్రామ స్వరాజ్య ఉద్యమం ఆవశ్యకత, లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామ స్వరాజ్య ఉద్యమంలో భాగస్వాములు కావాలని, ప్రజలతో కలిసి గ్రామాల నుంచి మార్పుకు నాంది పలకాలని విష్ణు వర్ధన్ గౌడ్‌ను కాసాని శ్రీనివాసరావు గౌడ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాసాని శ్రీనివాసరావు గౌడ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా గ్రామీణ భారతదేశం ఇంకా మౌలిక సమస్యలతో పోరాడుతూనే ఉందని అన్నారు. గ్రామాల్లోనే అపారమైన మానవ వనరులు, ప్రకృతి వనరులు, వ్యవసాయ వనరులు, సంప్రదాయ వృత్తులు, నైపుణ్యాలు ఉన్నప్పటికీ వాటిని స్థానిక ప్రజల అభివృద్ధికి వినియోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

**గ్రామానికి సంబంధించిన నిర్ణయం గ్రామంలోనే జరగాలి**

గ్రామానికి అవసరమైన అభివృద్ధి ప్రణాళికలు హైదరాబాద్‌లోనో, ఢిల్లీలోనో నిర్ణయించి గ్రామాలపై రుద్దడం కాకుండా, గ్రామ ప్రజలే తమ అవసరాలను నిర్ణయించుకునే అధికారం పొందాలని కాసాని శ్రీనివాసరావు గౌడ్ అన్నారు. గ్రామ సభలకు నిజమైన అధికారాలు ఇవ్వడం, స్థానిక వనరులపై స్థానిక ప్రజలకు హక్కులు కల్పించడం, గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం, రైతులకు గిట్టుబాటు ధర, సంప్రదాయ వృత్తులకు పునర్జీవం, గ్రామాల్లో నాణ్యమైన విద్యా–వైద్య సదుపాయాలు అందించడం గ్రామ స్వరాజ్య ఉద్యమం ప్రధాన లక్ష్యాలని వివరించారు. "గ్రామం బలపడితేనే రాష్ట్రం బలపడుతుంది.. రాష్ట్రం బలపడితేనే దేశం బలపడుతుంది. గ్రామాన్ని అభివృద్ధి కేంద్రంగా మార్చకుండా దేశ అభివృద్ధి సాధ్యం కాదు" అని కాసాని శ్రీనివాసరావు గౌడ్ స్పష్టం చేశారు.

**రాజకీయ అధికారమే కాదు.. ప్రజల చేతుల్లో పాలనా అధికారం**

ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో ఎన్నికల సమయంలో ప్రజలను ఓటర్లుగా మాత్రమే చూస్తున్నారని, ఎన్నికల తర్వాత ప్రజల భాగస్వామ్యం పరిమితమవుతోందని ఆయన అన్నారు. గ్రామ స్వరాజ్యం అంటే కేవలం గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, భవనాలు నిర్మించడం కాదని, ప్రజల చేతుల్లో నిర్ణయాధికారం పెట్టడమే నిజమైన గ్రామ స్వరాజ్యమని కాసాని శ్రీనివాసరావు గౌడ్ అన్నారు. "మన రాజ్యం -- మనం ఏలుదాం" అనే భావన ప్రతి గ్రామంలో బలపడాలని, ప్రజలు తమ గ్రామ పాలనలో ప్రత్యక్ష భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ప్రజలకు ఇప్పుడు గ్రామ స్వరాజ్యమే అవసరం: విష్ణు వర్ధన్ గౌడ్**

ఈ సందర్భంగా పొగాకుల విష్ణు వర్ధన్ గౌడ్ మాట్లాడుతూ, ప్రస్తుత సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో ప్రజలకు గ్రామ స్వరాజ్యం అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలు, సమస్యలు, అవకాశాలను గుర్తించి స్థానిక స్థాయిలోనే పరిష్కారాలు కనుగొనే విధానం బలపడాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభ, మానవ వనరులు, సహజ వనరులను సక్రమంగా వినియోగించుకుంటే గ్రామాల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని తెలిపారు. విద్య, ఉపాధి, వ్యవసాయం, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు, గ్రామీణ ఆర్థికాభివృద్ధి వంటి అంశాలను గ్రామ స్వరాజ్య దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందని విష్ణు వర్ధన్ గౌడ్ అభిప్రాయపడ్డారు. "ప్రజల భాగస్వామ్యం లేకుండా జరిగే అభివృద్ధి సంపూర్ణ అభివృద్ధి కాదు. ప్రజలే తమ గ్రామ భవిష్యత్తును నిర్ణయించుకునే పరిస్థితి రావాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు గ్రామ స్వరాజ్యం అవసరం ఉంది" అని ఆయన పేర్కొన్నారు.

**మేధావులు, విద్యావేత్తలు, యువత ఉద్యమంలోకి రావాలి**

గ్రామ స్వరాజ్య ఉద్యమం ఒక రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితమైన కార్యక్రమం కాదని, ఇది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విస్తృత సామాజిక ఉద్యమంగా ఎదగాలని కాసాని శ్రీనివాసరావు గౌడ్ అన్నారు. విద్యావేత్తలు, రచయితలు, మేధావులు, సామాజిక ఉద్యమకారులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వివిధ వృత్తుల ప్రతినిధులు గ్రామ స్వరాజ్యంపై చర్చించి తమ సూచనలు ఇవ్వాలని కోరారు. గ్రామాలను సందర్శించి ప్రజలతో నేరుగా మాట్లాడటం, వారి సమస్యలను తెలుసుకోవడం, స్థానిక పరిష్కారాలను రూపొందించడం, గ్రామ స్వరాజ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం తమ ఉద్యమంలో కీలక భాగమని ఆయన తెలిపారు. గ్రామం నుంచి దేశం వరకు కొత్త పాలనా ఆలోచన. గ్రామ స్వరాజ్యం ద్వారా గ్రామీణ ప్రజలను అభివృద్ధి ప్రక్రియలో క్రియాశీల భాగస్వాములుగా మార్చి, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, స్థానిక ఉపాధిని పెంచడం, గ్రామీణ యువత వలసలను తగ్గించడం, మహిళల ఆర్థిక స్వావలంబనను పెంపొందించడం, రైతు మరియు సంప్రదాయ వృత్తుల కుటుంబాలకు భద్రత కల్పించడం సాధ్యమవుతుందని కాసాని శ్రీనివాసరావు గౌడ్ వివరించారు. ఈ దిశగా గ్రామ స్వరాజ్య ఉద్యమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జై స్వరాజ్ పార్టీ కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. "గ్రామాన్ని కేవలం ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు ముగింపు పలికి, గ్రామాన్ని పాలనా కేంద్రంగా మార్చే రాజకీయ వ్యవస్థ రావాలి. ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల భాగస్వామ్యంతో నడిచే పాలన రావడమే గ్రామ స్వరాజ్య లక్ష్యం" అని కాసాని శ్రీనివాసరావు గౌడ్ అన్నారు. అనంతరం సీఎస్బీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ బాల లత మల్లవరపుతో జరిగిన మరో భేటీలో గ్రామ స్వరాజ్య ఉద్యమాన్ని మేధావులు, విద్యావేత్తలు, సామాజిక ఉద్యమకారులతో మరింత విస్తృతంగా అనుసంధానం చేసే దిశలో ముఖ్యమైన ముందడుగుగా కాసాని శ్రీనివాసరావు గౌడ్ పేర్కొన్నారు. ఈ భేటీలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనగాం వెంకటేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, నర్సిరెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

# గత పాలకుల పనితీరుకు కాలనీలు అవస్థలు





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: పిట్లం మండల కేంద్రంలోని పలు కాలనీలు మౌలిక వసతుల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గతంలో సరైన టౌన్ ప్లానింగ్ లేకుండా ప్లాట్లకు అనుమతులు ఇవ్వడంతో రోడ్లు, డ్రైనేజీలకు స్థలం లేకుండా పోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బ్రహ్మంగుడి వెనుక ఉన్న కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు లేక వర్షపు నీరు నిలిచి కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఎన్ని ప్రభుత్వాలు మారినా.. అంబేద్కర్ చౌరస్తా దుస్థితి మారదా?**

పిట్లం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా రహదారి అధ్వానంగా మారింది. చౌరస్తా నుంచి నాలుగు వైపులా సుమారు అర కిలోమీటర్ మేర రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు చేరడంతో ప్రమాదాల భయం నెలకొంది. ఏళ్లుగా సమస్య కొనసాగుతున్నా పరిష్కారం లభించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చి నాలుగు వైపులా బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

# త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలి: చైర్ పర్సన్





ఇది కద నిజం:రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ తెలిపారు పరిగి ఎర్రగడ్డ పల్లి రోడ్డులో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించి పనులు సక్రమంగా జరపాలని నాణ్యత పాటించాలని సూచించారు

అన్ని వార్డుల్లోనూ అవసరమైన చోట్ల ఎమ్మెల్యే ఆదేశాలతో నూతన రోడ్లో నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు పరిగి పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ యూసుఫ్, బాదం అఖిల శ్రీనివాస్, కో–ఆప్షన్ నెంబర్ అక్బర్ హుస్సేన్, నాయకులు దోమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా చేనేత సెల్ కన్వీనర్‌గా కంది శ్రీరాములు నియామకం


**చేనేత కార్మికుల సమస్యలపై పోరాడతానని వెల్లడి**



ఇది కద నిజం: హైదరాబాద్ వనస్థలిపురంలోని కర్నాటి గార్డెన్స్‌లో నిర్వహించిన చేనేత దినోత్సవ సభ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా చేనేత సెల్ కన్వీనర్‌గా కంది శ్రీరాములు నియమితులయ్యారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచందర్ రావు ఆదేశాల మేరకు, రాష్ట్ర చేనేత సెల్ కన్వీనర్ కర్నాటి ధనంజయ ఈ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కంది శ్రీరాములు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారతీయ సంస్కృతికి ప్రతీక అయిన చేనేత రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న ఆయన, కష్టాల్లో ఉన్న చేనేత కార్మికుల హక్కులు, ఉపాధి, మరియు సంక్షేమం కోసం తాను నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని ప్రతి మండలంలో చేనేత వస్త్రాల వినియోగంపై విస్తృత అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కార్మికుడికి అందేలా చిత్తశుద్ధితో కృషి చేస్తానని, స్వదేశీ రంగాన్ని బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని శ్రీరాములు ఈ సందర్భంగా ప్రకటించారు.

# భాగ్యరథి డిగ్రీ కళాశాలలో ఘనంగా బోనాల పండుగ

**తెలంగాణ సంస్కృతిని చాటిన విద్యార్థులు**



ఇది కద నిజం: భాగ్యరథి డిగ్రీ కళాశాలలో బోనాల పండుగను విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు కలిసి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు అమ్మవారి వేషధారణలతో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా చేసిన ప్రత్యేక ప్రదర్శనలు మరియు బోనాల ప్రాముఖ్యతను వివరించిన తీరు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొని విద్యార్థుల ప్రతిభను మనస్ఫూర్తిగా అభినందించారు. బోనాల పండుగ మనకు భక్తి, ఐక్యత, క్రమశిక్షణతో పాటు సాంస్కృతిక విలువలను గుర్తు చేస్తుందని, విద్యార్థులు చదువుతో పాటు మన పూర్వీకుల సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. మన తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ కళాశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది.

# సికింద్రాబాద్‌లో కియా కొత్త ఎలక్ట్రిక్ కార్ ఆవిష్కరణ

**ప్రారంభించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**




ఇది కద నిజం:సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ శనివారం రాత్రి రైల్ నిలయం సమీపంలోని కియా మోటార్స్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కియా మోటార్స్ సరికొత్త ఎలక్ట్రిక్ కారును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో కాలుష్య రహిత మరియు పర్యావరణ అనుకూల ఎలక్ట్రిక్ వాహనాల శకం ప్రారంభమైందని, భవిష్యత్తు అంతా ఈ వాహనాలదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ఇటువంటి ఇ–వాహనాలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఘనమైన ఆవిష్కరణ కార్యక్రమంలో యువనేత తీగుళ్ళ కిశోర్ కుమార్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, షోరూమ్ ప్రతినిధులు మరియు ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# సినిమా న్యూస్

## ‘ఇరుముడి’ ట్రైలర్ రిలీజ్

మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రియ భవానీ శంకర్ కథానాయికగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘ఇరుముడి’. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ‘ఇరుముడి’ ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను కూడా గ్రాండ్‌గా నిర్వహించేందుకు చిత్రబృందం ఏర్పాట్లు చేస్తోంది. భీమవరంలోని ఎస్‌కేఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 5 గంటల నుంచి గ్రాండ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు మేకర్స్ తెలిపారు.


ఈ కార్యక్రమంలో ‘ఇరుముడి’ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ రెండు విభిన్నమైన లుక్స్‌లో కనిపిస్తున్నారు. ఒకవైపు చేతిలో ఆయుధంతో పవర్‌ఫుల్‌గా కనిపిస్తుండగా.. మరోవైపు అయ్యప్ప మాల ధరించి కనిపిస్తున్నారు. దీంతో ఈ సినిమా ట్రైలర్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఆగస్టు 21, 2026న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది.




## ‘మీర్జాపూర్’ ట్రైలర్ రచ్చ షురూ

పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందు, శ్వేతా త్రిపాఠి, రవి కిషన్, జితేంద్ర కుమార్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘మీర్జాపూర్: ది మూవీ’. గుర్మీత్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ‘మీర్జాపూర్’ వెబ్ సిరీస్‌కు దేశవ్యాప్తంగా ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సిరీస్‌కు సంబంధించిన తదుపరి ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ‘మీర్జాపూర్: ది మూవీ’పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ‘మీర్జాపూర్: ది మూవీ’ ట్రైలర్‌ను ఆగస్టు 11న విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్, ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతోంది.



## నయనతార ‘హాయ్’ వాయిదా

యంగ్ హీరో కవిన్, లేడీ సూపర్‌స్టార్ నయనతార కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న లేటెస్ట్ మూవీ ‘హాయ్’. విష్ణు ఎడవన్ దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ కామెడీ మూవీని రౌడీ పిక్చర్స్, సెవన్ స్క్రీన్ స్టూడియో సంయుక్తంగా నిర్మించాయి. జెన్ మార్టిన్ సంగీతం అందించాడు. ఇదిలా ఉంటే.. హాయ్ మూవీ ఆగస్టు 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే.. సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ సినిమా కూడా ఆగస్టు 14న రిలీజ్‌కు ఉండటంతో ఈ సినిమా వాయిదా పడబోతున్నట్లు గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ వార్తలనే నిజం చేస్తూ.. హాయ్ సినిమా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు మేకర్స్. అలాగే ఆగస్టు 28న రిలీజ్ కాబోతున్నట్లు అఫీషియల్‌గా ప్రకటిస్తూ ఓ కొత్త పోస్టర్‌ను షేర్ చేశారు.




## బాక్సాఫీస్ వద్ద వరుణ్ జోరు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా సరైన విజయం దక్కలేదు. వరుస సినిమాలు ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోవడంతో ఆయన అభిమానులు కూడా మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘కొరియన్ కనకరాజు’ వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది.తాజా సమాచారం ప్రకారం ‘కొరియన్ కనకరాజు’ ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన ‘గద్దలకొండ గణేష్’ సినిమాను ‘కొరియన్ కనకరాజు’ అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా ‘కొరియన్ కనకరాజు’ మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది. ముఖ్యంగా హారర్, కామెడీ అంశాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయనే టాక్ రావడంతో వీకెండ్‌లో వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉంది. ‘కొరియన్ కనకరాజు’కి మరో ప్లస్ పాయింట్ సోమవారం బోనాల హాలీడే. వీకెండ్‌తో పాటు సోమవారం కూడా థియేటర్లకు ప్రేక్షకుల రాక పెరిగితే సినిమా కలెక్షన్లకు మరింత బలం చేకూరే అవకాశం ఉంది. ఇప్పటికే మంచి ఓపెనింగ్ సాధించిన ఈ సినిమా.. ఇదే జోరును వీకెండ్‌లో కొనసాగిస్తే వరుణ్ తేజ్ కెరీర్‌లో మరో విజయంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.




## థియేటర్లలో ‘డీసీ’ హంగామా

దర్శకుడిగా స్టార్‌డమ్ అందుకున్న లోకేష్ కనగరాజ్ ఇప్పుడు హీరోగా కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆయన కథానాయకుడిగా పరిచయమైన ‘డీసీ’ క్రైమ్ యాక్షన్ డ్రామా శుక్రవారం థియేటర్లలో విడుదలైంది. అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో బాలీవుడ్ నటి వామికా గబ్బి కథానాయికగా నటించారు. విడుదలకు ముందే భారీ బజ్ ను క్రియేట్ చేసిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ విషయంలోనూ ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చింది. తాజా సమాచారం ప్రకారం, ‘డీసీ’ పోస్ట్ థియేట్రికల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ Sun NXT సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని ఆఫీషియల్ గా అనౌన్స్ చేశారు మేకర్స్. అయితే థియేటర్లలో సినిమా ప్రదర్శన పూర్తయిన తర్వాత Sun NXT వేదికగా ‘డీసీ’ ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. అయితే ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ను మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు.

ఇక సినిమా విషయానికి వస్తే, ‘డీసీ’లో లోకేష్ కనగరాజ్ పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు దర్శకుడిగా యాక్షన్, క్రైమ్ కథలను తెరకెక్కిస్తూ తనదైన ముద్ర వేసిన ఆయన, ఇప్పుడు అదే తరహా యాక్షన్ తో హీరోగా ఎలా మెప్పిస్తారన్నది ఈ సినిమాపై ఆసక్తిని పెంచింది. మరోవైపు ‘రాకీ’, ‘సాని కాయిదం’, ‘కెప్టెన్ మిల్లర్’ వంటి విభిన్నమైన క్రైమ్, యాక్షన్ కథలతో గుర్తింపు తెచ్చుకున్న మాతేశ్వరన్ దర్శకత్వం వహించిన సినిమా కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. సినిమా విడుదలైన వెంటనే ‘డీసీ’కి విమర్శకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ ఏడాది కోలీవుడ్‌లో వచ్చిన అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా పలువురు క్రిటిక్స్ ఈ సినిమాను ప్రశంసించినట్లు సమాచారం. కథనం, యాక్షన్ ట్రీట్‌మెంట్, నటీనటుల ప్రదర్శనతో పాటు అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వ శైలికి కూడా పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది.

## ప్రీ రిలీజ్‌కు రెడీ

కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, రోషన్ బషీర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం ‘అగధ’. తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతగా, దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఎమ్మెస్ రాజు ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమాను ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి పలు ప్రచార చిత్రాలను విడుదల చేయగా, అవి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా ఈ మూవీ బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను విడుదల చేసింది. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఆగస్టు 10న మధ్యాహ్నం 2:30 గంటలకు నిర్వహించనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇక జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, వనితా విజయ్‌కుమార్, కనకవ్వ తదితరులు ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ సినిమాను నిర్మించారు. రాకేష్ వెంకటాపురం సంగీతం అందించారు.

